

**జరిగిన కథ :** కన్యాకుబ్జ రాకుమారులు పశ్చిమ దిగ్విజయ యాత్ర చేస్తున్నారు. వారిలో పెద్దవాడైన శ్రీముఖుడు.. మహారాష్ట్ర రాకుమారిని పెళ్లాడాడు. మిగిలిన నలుగురూ వరుణద్వీపానికి వెళ్లే ప్రయత్నంలో సముద్రంలో ఓడలు మునిగి గల్లంతయ్యారు. విక్రముడు ప్రాణాలతో బయటపడి.. ఒక ద్వీపంలోని గాయత్రి ఆలయానికి చేరుకున్నాడు. అక్కడ ఆకాశం నుంచి దిగివస్తున్న దేవకన్యలను చూశాడు.




# కాబోయే వరుడు


అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**


అపూర్వమైన సుగంధ సౌరభం ఆ ప్రాంతమంతా వ్యాపించింది. గర్భాలయంలో అమ్మవారి వద్ద పరిచయమైన పరిమళమే అది. 'అయితే దేవిని క్రమం తప్పకుండా పూజించేది వీళ్లేనన్నమాట' అనుకున్నాడు విక్రముడు.

ఇంతలో నేలకు దిగిన నక్షత్రాల్లా.. ఆ నలుగురు దేవకాంతలూ తటాకం వద్దకు చేరుకున్నారు. తమ కట్టువస్త్రాలను గట్టుపై విడిచి, కబుర్లు చెప్పుకొంటూ జలక్రీడలు సాగించారు.

'ఆహా! వీరు దేవకాంతలే కావచ్చు. వీరి దర్శనం చేత నేను ధన్యుడినయ్యాను. నేను వీరితో మాట్లాడగలనా?! నాకంతటి భాగ్యం పడుతుందా?!' అనుకున్నాడు విక్రముడు.

అంతలోనే మళ్లీ..

'ఇది కలో నిజమో తెలియకుండా ఉంది. స్వప్నమే అయితే మన సంకల్పాలతో పనిలేదు కదా! చూద్దాం ఇదెంతవరకు పోతుందో'.. అనుకుంటూ గర్భాలయంలోకి పోయి, అమ్మవారి పాదపీఠం వెనుక దాక్కుని ఉన్నాడు.

జలక్రీడలు ముగించిన దేవకాంతలు ఆలయంలో ప్రవేశించారు. అమ్మవారిని అనేక స్తోత్ర పాఠాలతో కీర్తించారు. విగ్రహం ముందున్న నిర్మాల్యాన్ని గమనించి.. అంతకుముందు తాము చేసిన పూజ కాదని కొంతసేపు తమలో తాము తర్కించుకున్నారు. గాలికి చెదిరి ఉండవచ్చని సమాధానపడి, షోడశోపచారాలతో గాయత్రీ దేవిని పూజించారు.

పూజలో భాగంగా సంకల్పంలో వారు చెప్పుకొన్న పేర్లను విక్రముడు గుర్తుపెట్టుకున్నాడు. వారిలో మొదటి కన్య ఇంద్రుని కూతురు మధుమతి. తరువాతి వారు వరుసగా యముని కూతురైన గంధవతి, వరుణుని కూతురైన వారుణి, కుబేరుని కూతురైన చంద్రకళ.

పూజ పూర్తయిన తరువాత మధుమతి చేతులు జోడించి..

''వేదమాతా! దేవగురుని ఆజ్ఞప్రకారం ఆరు సంవత్సరాల నుంచి ప్రతి శుక్రవారం ఇక్కడికి వచ్చి నిన్ను పూజించి, జాగరణ వ్రతం చేస్తున్నాం. రాబోయే శుక్రవారంతో మా వ్రతం పూర్తవబోతున్నది. ఇక మా అభీష్టాన్ని ఎలా నెరవేరుస్తావో.. ఏమో!! అన్నిటికీ నిన్నే నమ్ముకున్నాం'' అని గాయత్రీదేవిని ప్రార్థించింది.

ఆ తరువాత మబ్బుల చాటునుంచి బయటపడ్డ మెరుపుతీగల్లా ఆ నలుగురూ గర్భాలయం నుంచి బయటికొచ్చి ముఖమంటపంలో ఉన్న స్ఫటికశిలా వేదికపై కూర్చుని మాట్లాడుకోసాగారు.

''గంధవతీ! మరొక్కవారంలో మన వ్రతం పూర్తవబోతున్నది. అప్పటికి అమ్మవారు మన అభీష్టాన్ని నెరవేర్చాల్సిందే! మన కోరికల్లా తగిన భర్తలను పొందడమే కదా.. ముందుగానే మనకు ఎలాంటి భర్తలు కావాలో అమ్మవారికి చెప్పుకొందాం. పై శుక్రవారం నాటికి అమ్మవారు మన కాబోయే భర్తలను సిద్ధంగా ఉంచుతుంది'' అన్నది మధుమతి.

దానికి గంధవతి నవ్వుతూ..

''సఖీ! అమ్మవారు మనకు ప్రత్యక్షమైనప్పుడు కదా.. వరాలు కోరవలసింది. ఇప్పుడే తొందరేల?!'' అన్నది.

''అయ్యో! మాత ప్రభావం నువ్వు ఎరుగవు కాబోలు. మహర్షులకు సైతం ఆమె దర్శనభాగ్యం లభించదు. ఆరాధించినవారి కోరికలు మాత్రం నెరవేరుస్తూ ఉంటుంది. కోరికలు నెరవేరడమే ఆమె అనుగ్రహించింది అనడానికి సంకేతం. ఈ విషయాన్ని దేవగురువు మనకు ముందే చెప్పారు కదా!? మరిచావా!'' అని గుర్తుచేసింది వారుణి.

అప్పుడు చివరిదైన చంద్రకళ కల్పించుకుని..

''సఖీ మధుమతీ! ముందుగా నువ్వే నీకు ఎటువంటి భర్త కావాలో కోరుకో. ఆ తరువాత మావంతు'' అని నవ్వింది.

మధుమతి తన మనసులోని మాట బయటికి చెప్పటానికి కొద్దిగా సిగ్గుపడింది.

''నన్ను అత్యాశపరురాలని అనుకోవద్దు. నాకు కాబోయే వరుడు గొప్ప వంశంలో జన్మించాలి. లోకాతీత సౌందర్యశాలి కావాలి. కావాల్సిన వస్తువులను సాధించుకోగలిగే నేర్పు ఉండాలి. ధర్మాన్ని విడిచిపెట్టకూడదు. సకల ఐశ్వర్యవంతుడు, శాసకుడు అయిన వాణ్నే కానీ నేను వరించలేను. అటువంటి భర్తనే నాకు ఇవ్వమని అమ్మవారిని ప్రార్థిస్తున్నాను'' అని పలికింది.

మిగిలిన ముగ్గురూ సంతోష సూచకంగా నవ్వారు.

తదుపరి గంధవతి మాట్లాడుతూ..

''చెలీ! నువ్వు ధీరోదాత్తుణ్ని కోరుకున్నావు. నేను మాత్రం సామాన్యుణ్ని కోరుకోగలనా?! నువ్వు కోరిన గుణాలన్నీ ఉండి.. కీర్తిప్రతాపాలు కలిగి, పురుషార్థాల